ప్రజాశక్తి

గురువారం 7 మార్చి 2024 5

పార్వతీపురం మన్యం

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.విలియం క్యారీ తెలిపారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ - రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి రూపొందించిన 'పాలిటెక్నిక్ చదవడం ఉత్తమం, ఎందువల్ల అంటే' పోస్టర్‌ను ఎంఆర్ నగర్ పాలిటెక్నిక్ కళాశాలలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి లోచర్ల రమేష్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పదో తరగతి తరువాత సాంకేతిక విద్యను అభ్యసించడం సులువైన, తెలివైన మార్గం అన్నారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు గణనీయంగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె.వెంకట ఉజ్వల్, ఇసిఇ విభాగాధిపతి జి.ఉదయ భాస్కర్, అధ్యాపకులు పి.అనురాధ, మండల ఉపాధ్యక్షులు బి.రవి కుమార్, సర్పంచ్ వి.త్రినాథ రావు, అమ్మ యూత్ క్లబ్ అధ్యక్షులు పి.శ్రీనివాస పాల్గొన్నారు.



నిర్వాసిత గ్రామం కొత్త అడ్డతీగల

- తాటిపూడి వచ్చే .. ఊరుపోయే...
- జిందాల్ కోసం భూములు పాయె
- ఇదీ కొత్త అడ్డతీగల గ్రామస్తుల దుస్థితి
- భూములు అప్పగించకపోతే జీవనోపాధి లేదంటున్న బాధితులు

జీవితమంతా నిర్వాసితులుగానే..

చిన్నతనంలో ఎంతో అమితంగా ఇష్టపడే ఊరు పోయింది. అప్పట్లో ఆ ఊరు నుంచి ఈ ఊరు ఎందుకు వచ్చామో మాకే తెలీదు. తీరా ఇక్కడికి వచ్చాక మా అమ్మ, నాయన మాటల ద్వారా అర్థమైంది... అక్కడేదో తాటిపూడి డ్యాం కట్టారని, దాని వల్ల ఊరు మునిగిపోయే పరిస్థితి ఉందని, అందువల్లే అక్కడి నుంచి ఇక్కడికి ప్రభుత్వమే తరమేసిందని. బాల్యం దశవరకు మేమంతా వ్యవసాయం, పాడిపంటలతో రాజుల్లా బతికేటోళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు.

- ఇదీ ఎస్.కోట మండలం కొత్త అడ్డతీగ గ్రామంలోని వృద్ధుల జీవన గాథ.

తాటిపూడి జలాశయం నిర్మాణ సమయంలో మా తాతల నాటి భూములు అమ్మానాన్నలు కోల్పోయారట. ముంపుగ్రామంగా మారడంతో ఇదిగో ఇక్కడికి తరిమేశారు. అక్కడ కోల్పోయిన భూములకు బదులు ఇదిగో మా ఊరిపక్కనే ఈ భూములు ఇచ్చారట. ఒకప్పుడు అడవిని తలపించే ఈ ప్రాంతం రాళ్లు,రప్పలతో నిండివుండేది. తమ యవ్వనమంతా ఇదిగో ఈ కనిపిస్తున్న భూములను చదును చేసి వ్యవసాయానికి అనువుగా తీర్చిదిద్దాము. కానీ, ఈ భూములు ప్రస్తుతం మా ఆధీనంలో లేవు. బాక్సైట్ శుద్ధి కర్మాగారం ఏర్పాటు పేరిట ప్రభుత్వమే భూములు లాగేసుకుని జిందాల్ సంస్థకు అప్పనంగా అప్పజెప్పింది. ఆలా మునుపు మా తండ్రులు పుట్టిన ఊరు కోల్పోతే, తాము భూములు కోల్పోయాం. జీవనోపాధికి దూరమయ్యాం.

- ఇది కొత్త అడ్డతీగ గ్రామానికి చెందిన నడివయస్కుల ఆవేదన.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అది 1965-68 మధ్య కాలం. అప్పటికే విశాఖపట్నం జనాభా పెరుగుతోంది. ఆ నగరానికి తాగునీరు అందించడంతోపాటు గంట్యాడ, జామి మండలాల్లో కొంతమేర సాగునీరు అందించాలనే లక్ష్యంతో తాటిపూడి జలాశయాన్ని నిర్మించారు. అప్పట్లో నాలుగైదు గ్రామాల ప్రజానీకం భూములు కోల్పోయారు. అడ్డతీగల గ్రామం పూర్తిగా ముంపునకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ గ్రామంలోని నిర్వాసితులందర్నీ ఎస్.కోట మండలం తుంగమడుగుల - నిమ్మలపాలెం మధ్యలో నిర్వాసిత కాలనీ ఏర్పాటు చేసి, దానికే కొత్త అడ్డతీగల అని నామకరణం చేశారు. అప్పట్లో ప్రభుత్వమే నేరుగా ఇళ్లు నిర్మించి ఇవ్వడంతోపాటు ఆచుట్టుపక్కలే భూమికి బదులు భూమి ఇచ్చింది. అప్పట్లో ఈ ప్రాంతమంతా చిట్టడివిని తలపించేదని, అందులోనూ రాళ్ల రప్పలు నిండివుండడంతో పంటల సాగుకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి చాలా సమయం పట్టిందని ఈ గ్రామానికి చెందిన సుగురి సన్యాసినాయుడు, చిన్నయ్యదొర ప్రజాశక్తికి వివరించారు. గ్రామం ఏర్పాటుచేసి సుమారు 59ఏళ్లు కావస్తోంది. సుమారు 100కుపైగా కుటుంబాలున్న ఈ గ్రామంలో నాడు కుటుంబ బాధ్యతలు మోసేవారిలో ఒకరిద్దరు తప్ప చాలా మంది ప్రస్తుతం ఈ గ్రామంలో లేరు. అప్పట్లో ఇక్కడికి మాకాం మార్చినవారి కొడుకులు, కూతుళ్లు కూడా ప్రస్తుతం వృద్ధాప్యానికి చేరుకున్నారు. అయినా సరే.... తాటిపూడి నిర్వాసితులుగా అప్పట్లో ప్రభుత్వం తమ తాత, తండ్రులకు ఇచ్చిన భూములపై కాయ,కష్టం చేసుకుని జనం బతుకీడ్చేవారు. ఇదంతా గతం మాట.

2006లో ఎస్.కోట మండలం బొడ్డవర ప్రాంతంలో బాక్సైట్ శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేస్తామంటూ బొడ్డవర, కిల్తంపాలెం, ముషిడిపల్లి పంచాయతీల పరిధిలోని బొడ్డవర, లక్ష్మీపురం, అమ్మవలస, మొట్టవలస, చినఖండేపల్లి, ముషిడిపల్లి, కొత్త అడ్డతీగల తదితర గ్రామాల పరిధిలోని 1127 ఎకరాలను ప్రభుత్వం రైతులను నుంచి బలవంతంగా లాక్కుని జిందాల్‌కు అప్పగించింది. అప్పట్లో ఎకరాకు రూ.2.5లక్షల చొప్పున మాత్రమే పరిహారం ఇచ్చారు. అది కూడా పట్టాలు ఉన్నవారికి మాత్రమే. తాటిపూడి జలాశయ సమయంలో ప్రభుత్వం తమ తాతల వద్ద జిరాయితీ పట్టా భూములు తీసుకున్నప్పటికీ, డి-పట్టాలతో భూములు అప్పగించారని ఈ గ్రామానికి చెందిన పాగి రాము, నారికేలం నర్సమ్మ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టా భూములు కాదనే నెపంతో తమకు పరిహారం ఇవ్వకుండానే లాగేసుకున్నారని చెప్పారు. గట్టిగా అడిగితే ఎంతో కొంత ఇస్తామంటూ చెప్పిన అధికారులు, నాయకులు ఇప్పుడు కనిపించడం లేదని మొరపెట్టుకుంటున్నారు.

మరోవైపు జిందాల్ హామీ ప్రకారం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇవ్వడానికి ఇక్కడ అసలు కంపెనీయే ఏర్పాటు చేయలేదు. మరోవైపు భూములు కోల్పోయారు. అంతకు ముందు ఊరే వదులు కోవాల్సివచ్చింది. మరోవైపు ఆయా భూములను రూ.112.77 కోట్లకు జిందాల్ సంస్థ బ్యాంకులో తనఖా పెట్టి తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నట్టుగా తెలుస్తోంది. ఈనేపథ్యంలో ఇదే భూముల్లో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తామంటూ ఏడాది క్రితం రాష్ట్ర మంత్రివర్గం ప్రకటించినప్పటికీ అమలుకు నోచుకోలేదు.

జీవితాంతం నిర్వాసితులమే

నా జీవితం మొత్తం నిర్వాసితుడిగానే మిగిలిపోయింది. మా పిల్లలకు కూడా భరోసా ఇవ్వలేక పోతున్నాం. 50ఏళ్ల క్రితం తాటిపూడి జలాశయ నిర్మాణంలో భాగంగా అడ్డతీగల గ్రామం ముంపు ప్రాంతంగా మారింది. నా చిన్నప్పుడు అక్కడ మా తాత తండ్రుల నుంచి వచ్చిన భూములు పోయాయి. కొత్త అడ్డతీగల పేరిట అప్పట్లో ఈ గ్రామాన్ని ఏర్పాటు చేశారు. మాతోపాటు 50 కుటుంబాలవారికి 3ఎకరాల చొప్పున బీడు భూములకు డి-పట్టాలు ఇచ్చారు. తీరా వాటిని సాగుకు అనుగుణంగా తయారు చేసేసరికి 18ఏళ్ల క్రితం తిరిగి లాగేసుకున్నారు. డి-పట్టా పేరుతో పరిహారం కూడా ఇవ్వలేదు. పరిశ్రమా లేదు. ఉద్యోగాలు లేదు. భూమీలేదు. తిరిగి ఆ భూములిస్తే తప్ప బతుకు లేదు.

- నారికేలం అప్పన్న, కొత్త అడ్డతీగల గ్రామం

తహశీల్దార్‌కు వినతి పత్రం ఇవ్వడానికి నిరీక్షిస్తున్న ఏగులవాడ పంచాయతీ ప్రజలు

వేలిముద్ర వేయించారు..

రేషన్ ఇవ్వడం మానేశారు

ఏగులవాడ పంచాయతీలో మూడు నెలలుగా అందని రేషన్

ప్రజాశక్తి - కురుపాం

వేలిముద్ర వేయించి స్లిప్పు ఇచ్చి మూడు నెలలుగా రేషన్ అందించడం లేదు. డిసెంబర్, ఫిబ్రవరి నెలల్లో అరకొరగా కొందరికి ఇచ్చినా, జనవరిలో పూర్తిగా రేషన్ ఇవ్వడం మానేశారు. ఈ సంఘటన మండలంలో ఏగులవాడ పంచాయతీలో చోటుచేసుకుంది. దీంతో గత్యంతరం లేక ఆ పంచాయతీకి చెందిన రేషన్‌కార్డుదారులు బుధవారం తహశీల్దార్ సత్యనారాయణకు సమస్యను విన్నవించుకునేందుకు కురుపాం వచ్చారు. తహశీల్దార్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏర్పాటు చేసిన సమావేశంలో ఉండటంతో గంటల తరబడి నిరీక్షించారు. అనంతరం తహశీల్దార్ సమావేశం నుంచి బయటకు వచ్చాక ఆయనకు వినతి అందించారు. తమ డిపో పరిధిలో సేల్స్‌మెన్ వేలిముద్రలు వేయించి సిప్పులు ఇచ్చి రేషన్ ఇవ్వడం లేదని వాపోయారు. రేషన్ పంపిణీ చేసేలా చూడాలని కోరారు.

అనంతరం ఆర్ఐ కరుణాకర్‌ను 'ప్రజాశక్తి' వివరణ కోరగా, ఆ గ్రామానికి ఉప తహశీల్దార్‌ను పంపించామని, అందరికీ రేషన్ అందేలా చూస్తామని తెలిపారు.

అవినీతి అనకొండ శ్రీవాణి

పుష్పశ్రీవాణిపై టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జగదీశ్వరి తీవ్ర ఆరోపణలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి ప్రజా సమస్యలను పక్కనపెట్టి, ఆస్తులు కూడబెట్టుకునే అనకొండగా మారారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి తీవ్ర ఆరోపణలు చేశారు. బుధవారం గుమ్మలక్ష్మీపురంలోని తన నివాసం వద్ద టిడిపి నాయకులతో కలిసి విలేకరులతో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి కనుసన్నల్లో కొమరాడలో భారీ ఇసుక తవ్వకాలు జరిగాయని ఆరోపించారు. ప్రభుత్వం గిరిజన అభివృద్ధి కోసం విడుదల చేసిన నిధులను సొంత పనుల కోసం దుర్వినియోగం చేశారన్నారు. ఐటిడిఎ ద్వారా వచ్చిన రూ.50 లక్షలు దారి మళ్లించారని చెప్పారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం వచ్చిన కోట్లాది రూపాయల్లో ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదన్నారు. రూ.500 కోట్లకు పైగా ఎమ్మెల్యే ఆస్తులను కూడపెట్టుకున్నారని ఆరోపించారు. అరకులో ఎకరాల కొద్ది భూమి, విజయవాడలో షాపింగ్ మాల్స్, వైజాగ్‌లో రూ.కోట్లు విలువ చేసే భూమి వంటి ఆస్తులను కూడబెట్టుకున్నారని తెలిపారు.

చెక్కు అందజేస్తున్న ఇన్‌ఛార్జి జెసి విష్ణుచరణ్

రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఖరీఫ్‌లో వర్షాభావం, మిచౌంగ్ తుఫానుతో జిల్లాలో పంటనష్టపోయిన 259 మంది రైతులకు 14.75 లక్షల రూపాయలు పరిహారం చెక్కును ఇన్‌ఛార్జి జాయింటు కలెక్టర్ సి.విష్ణుచరణ్ అందజేశారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సిఎం క్యాంపు కార్యాలయం నుండి నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌పుట్ సబ్సిడీని బటన్ నొక్కి నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరం నుండి జెసి, రైతులు వర్చువల్‌గా హాజరయ్యారు.

జిల్లాలో 60 గ్రామాలకు చెందిన 259 మంది రైతులు 221.92 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, రాగి పంటలు నష్టపోయినందుకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీగా 14.75 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు జెసి తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయ అధికారి ఎ.నిర్మలగౌరి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఓటర్ల మార్పులపై అభ్యంతరాల స్వీకరణ

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ఫారం - 6,7,8లపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల సంబంధిత అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించుటకు అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. తుది ఓటరు జాబితా ప్రకటన అనంతరం అందిన ఫిర్యాదులు, మీడియా నివేదికల ఆధారంగా విచారణ చేపట్టి 1128 తొలగించామన్నారు. వాటిలో 257 మంది చనిపోయారని తెలిపారు. జిల్లాలో 244 పోలింగు స్టేషన్లలో 1037 పోలింగు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. 26 పోలింగు స్టేషన్ల లొకేషన్లు, 244 పోలింగు కేంద్రాలు పేర్ల మార్పు

సమావేశంలో మాట్లాడుతున్న జెసి విష్ణుచరణ్

కోసం ఎన్నికల కమిషన్‌కు ప్రతిపాదనలు పంపించామని వివరించారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జి.కేశవ నాయుడు, టిడిపి ప్రతినిధి జి.వెంకటనాయుడు, లోక్‌సత్తా ప్రతినిధి కొత్తకోట పాపారావు, జనసేన ప్రతినిధి పైలా శ్రీనివాస రావు, సిపిఎం ప్రతినిధి పి. రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన టెట్ పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గతనెల 27వ తేదీ నుంచి విజయనగరం జిల్లాలో 5 కేంద్రాల్లో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) బుధవారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా టెట్ పరీక్ష కు మొత్తం 11580 మంది హాజరు కావాల్సి ఉండగా వారిలో 10429 మంది హాజరయ్యారు. 1151 మంది పరీక్షకు హాజరు కాలేదని విజయనగరం డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు.



ఎస్‌కె పాడు ప్రాంతంలో అడవిని పరిశీలిస్తున్న డిఎఫ్ఒ ప్రసూన

అడవుల పరిరక్షణకు చర్యలు

డిఎఫ్ఒ ప్రసూన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో అడవుల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి జివి ప్రసూన తెలిపారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్‌కె పాడు, జెకె పాడు ప్రాంతాల్లో ఉన్న టేకు ప్లాంటేషన్‌ను పరిశీలించారు. అడవుల్లో పలుచోట్ల హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవుల్లో విలువైన వృక్షజాతి ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా చెట్లు నరికినా, మంటలు పెట్టినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యగా సిబ్బంది నిత్యం పహారా కాస్తూ, ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కలప అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో కురుపాం ఫారెస్ట్ రేంజర్ మణికంతేశ్, అటవీ శాఖ బీట్ ఆఫీసర్ తిరుమల, గార్డ్ రామారావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

మీడియా సహకారం ఉండాలి

ఐటిడిఎ పిఒ కల్పనకుమారి

ప్రజాశక్తి-సీతంపేట

ప్రశాంతంగా ఎన్నికలకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సహకారం ఉండాలని, దీనిలో భాగంగా వాస్తవ వార్తలను మాత్రమే ప్రచురించాలని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి సూచించారు. బుధవారం పాలకొండ నియోజకవర్గంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ముఖ్యంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారానికి సంబంధించిన ప్రచార చిత్రాలు, కరపత్రాలు ముద్రిస్తే అభ్యర్థి పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. పాలకొండ నియోజకవర్గంలోని 287 పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు అవసరమయ్యే అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పాలకొండ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. గ్రామాల్లో ఇవిఎం యంత్రం ద్వారా ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

లక్ష్యాన్ని చేరుకోవాలి

ప్రజాశక్తి-సీతంపేట

ఉపాధి హామీ అమల్లో ఈ నెల 20వ తేదీలోగా ప్రగతి కనిపించాలని డ్వామా పీడీ రామచంద్ర రావు అన్నారు. బుధవారం సీతంపేట, భామిని మండలాల ఉపాధి హామీ సిబ్బంది, అదికారులతో స్థానిక వైకెపి కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. లక్ష్యాన్ని చేరుకోకుంటే శాఖా పరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. దీనిలో భాగంగా ప్రగతిలో చివరి స్థానంలో ఉన్న ముగ్గురు ఫీల్డ్ అసిస్టెంట్లకు మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సీతంపేట, భామిని ఎంపిడిఒలు కె.గీతాంజలి, శ్రీహరిరావు, ఎపిడి శ్రీహరి, ఎపిఒలు బాబూరావు, సాగర్, ఇసి పాండురంగ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున డ్వామా పీడీ రామచంద్రరావు

వృత్తిపరమైన సమస్యలు పరిష్కరించాలి

ఎంఇఒ-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సింహాచలం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండల విద్యాశాఖ అధికారులు-1 వృత్తి పరంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంఇఒ-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం, ప్రధాన కార్యదర్శి బి.రవినాయక్ కోరారు. బుధవారం గూగుల్ మీట్ ద్వారా రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఇఒ-1ల ప్రధాన సమస్యలపై చర్చించారు. ఉపాధ్యాయుల జీతభత్యాలను చేస్తున్న డిడిఒలుగా ఉన్నప్పటికీ, తమ జీతభత్యాలను చేసుకునే సెల్ఫ్ డ్రాయింగ్ పవర్ లేకపోవడం ఇబ్బందికరంగా మారిందని చెప్పారు. ఎంఇఒ-1లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంఇఒ-1, 2లకు విడుదల చేసిన జాబ్ చార్ట్ ఉత్తర్వులు జిఒ నంబర్ 89కు విరుద్ధంగా చాలాచోట్ల ఆర్‌జెడిలు, డిఇఒలు అన్ని విధులను ఎంఇఒ1 లు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిఒ నంబర్ 89 ప్రకారం జాబ్‌చార్ట్ కచ్చితంగా అమలు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తిచేశారు.

రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి

డిఎంహెచ్ఒ జగన్నాథరావు

ప్రజాశక్తి-భామిని

రక్త హీనత, మాత, శిశు మరణాల నివారణకు సమిష్టి కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు స్పష్టం చేశారు. భామిని మండలంలో బుధవారం భామిని, బత్తిలి, బాలేరు పిహెచ్‌సిలను ఆయన తనిఖీ చేశారు. బూర్జోలులో జెఎఎస్ పరిశీలన, బాలేరు సచివాలయంలో ప్రిజమ్10 పై సమీక్షా సమావేశం నిర్వహించారు. పిహెచ్‌సిల్లో సాధారణ ప్రసవాలు ఏమేరకు జరుగుతున్నాయి, వీటికి ఆరోగ్య అసరా వర్తింపజేస్తున్న వివరాలపై ఆరా తీసి రికార్డులు తనిఖీ చేశారు. గర్భిణులకు ఆరోగ్య ఆసరా వర్తింప జేయడంపై జాప్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫార్మసీలో మందుల నిల్వలు, వ్యాక్సిన్ నిల్వలు పరిశీలించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పలు కౌంటర్ల వద్ద ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అవసరమైన వారికి రిఫరల్స్ చేసి చికిత్స పూర్తయ్యే వరకు పర్యవేక్షణ చేయాలన్నారు. వివరాలు ఆన్లైన్ నమోదు చేయాలన్నారు.

బాలేరు సచివాలయంలో ప్రిజమ్10 ప్రాజెక్ట్‌పై నిర్వహించిన సమీక్షలో డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ పదేళ్లలోపు వయస్సున్న శిశు మరణాల రేటును తగ్గించడమే ప్రిజమ్-10 లక్ష్యమన్నారు. ఇందుకు వైద్య, సచివాలయ, మహిళా సమాఖ్య, స్వయం సహాయక సంఘాల సమిష్టి కృషి అవసరమని అన్నారు. ఇందులో ప్రధానంగా గర్భిణుల నమోదు త్వరగా జరగాలని ఆదేశించారు. అవసరమైన అన్ని ఆరోగ్య పరీక్షలు వెంటనే చేపట్టాలని సూచించారు. ప్రతీ సచివాలయ పరిధిలో రక్త హీనత, హైరిస్క్ గర్భిణీ, బాలింతలు వివరాలు, సామ్, మామ్ పిల్లల వివరాలు, రక్త హీనత ఉన్న కిశోర బాలికల వివరాలు ఉండాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో సంరక్షణ అధికారుల (అడాప్షన్ ఆఫీసర్)ను నియమించి, వీటిపై పర్యవేక్షణ చేసి వివరాలు ఎప్పటికప్పుడు అబ్జర్వేషన్ డైరీలో నమోదు చేయాలన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మండల కేంద్రంలోని వైటిసి కేంద్రాన్ని సందర్శించి, అక్కడ గర్భిణుల ఆరోగ్య పరిశీలన చేశారు. కాన్పు గడువు తేదీలను ఎంసిపి కార్డులో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ కొయ్యాన అప్పారావు తదితరులు ఉన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు

గిరిజన గర్భిణుల వసతిగృహాన్ని సందర్శిస్తున్న డిఎంహెచ్ఒ

మాట్లాడుతున్న డిపిఆర్‌ఒ రమేష్

ప్రజాస్వామ్యంలో యువతది కీలకపాత్ర

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రజాస్వామ్య వ్యవస్థలో యువతది కీలకపాత్రని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి కె.వెంకట ఉజ్వల్ అన్నారు. ఎంఆర్ నగర్ పాలిటెక్నిక్ కళాశాలలో యూత్ పార్లమెంట్‌ను నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకట ఉజ్వల్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు యువత అన్నారు. సమాజసేవకు యువత ముందుకురావాలని పిలుపునిచ్చారు. యువత తమ గ్రామాన్ని, తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో అడుగు ముందుకు వేయాలని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల పాత్ర అమోఘమన్నారు. ఎన్నికలలో యువత కీలక పాత్ర పోషించాలని కోరారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా నవసమాజానికి నాంది పలకవచ్చని చెప్పారు. వైస్ ఎంపిపి బంకురు రవికుమార్ మాట్లాడుతూ యువత ఉన్నత ఆశయాల దిశగా అడుగులు వేయాలని కోరారు. సర్పంచ్ వి.త్రినాథరావు మాట్లాడుతూ సర్పంచ్‌గా పనిచేస్తూ గ్రామానికి అనేక కార్యక్రమాలు చేయగలిగామనే సంతృప్తి ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో యూత్ పార్లమెంట్ నిర్వహించి సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి లోచర్ల రమేష్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.విలియం క్యారీ, ఇసిఇ విభాగాధిపతి జి.ఉదయ భాస్కర్, అధ్యాపకులు పి.అనురాధ, అమ్మ యూత్ క్లబ్ అధ్యక్షులు పి.శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు.

నార్లవలసలో బాబు షూరిటీ

ప్రజాశక్తి-సాలూరు రూరల్

మండలంలోని నార్లవలస పంచాయతీ పరిధిలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి.సంధ్యారాణి ఆధ్వర్యాన 'బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. స్థానికులతో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, డొంక అన్నపూర్ణ తౌడు, మచ్చ శ్యామ్, అప్పికొండ అనురాధ, యుగంధర్, బాలాజీ, కృష్ణ, తిరుపతిరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని ఉరిడి పంచాయతీ కొండబారిడి గ్రామంలో బుధవారం టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య ఆధ్వర్యంలో బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.జగదీశ్వరి సూపర్ సిక్స్ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల భవిష్యత్తుకు భరోసా కావాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ టి.మంజువాణి, టిడిపి నాయకులు రంజిత్ కుమార్ నాయక్, టి.దుర్గారావు, బోటు గౌరీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ పొదుపు చేయాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ప్రతి విద్యార్థీ డబ్బులు పొదుపు చేయాలని దిగువమండ పాఠశాల హెచ్‌ఎం పాలక దేవానంద్ అన్నారు. మండ ఎంపిపి పాఠశాలలో విద్యార్థులతో పొదుపు పథకాన్ని ఆయన ప్రారంభించారు. నేటి పొదుపు రేపటి భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు నగదు పొదుపు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్ సుబ్బారావు ఉన్నారు.

పిండిమిల్లు యంత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-సాలూరు రూరల్

జాతీయ చిరుధాన్యాల మండలి ఆధ్వర్యంలో గిరిజనులకు ఉచితంగా పిండి మిల్లుల యంత్రాలను పంపిణీ చేశారు. బుధవారం మండలంలోని రేగాపువలస, గంగన్న దొరవలస, మెట్టవలస గ్రామాల్లో గిరిజన రైతులకు పిండి మిల్లులను, రాగులు, కొర్రలు, ఊదలు విత్తనాలను అందజేశారు. సీతంపేట వ్యవసాయ పరిశోధన ప్రధాన శాస్త్రవేత్త పి.సీతారాం, వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎన్.లక్ష్మి, నారాయణరావు, ఐఎఫ్‌ఎస్ ఎఇఒ ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని చాపరాయి బిన్నిడి నుండి కానసింగి గ్రామానికి రూ.85 లక్షలతో చేపడుతున్న రహదారి పనులను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు, మౌలిక వసతులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రహదారి నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగు పడుతుందన్నారు. తాగునీరు, వైద్యం అన్ని రకాల మౌలిక వసతులు గిరిజనులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

రక్తహీనత నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-పాచిపెంట

రక్తహీనత నిర్మూలనపై స్థానిక సామాజిక భవనంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి జి.వెంకటరమణ, ఎంపిటిసి సభ్యులు దండి ఏడుకొండలు మాట్లాడుతూ పదేళ్లలోపు పిల్లల్లో మరణాల రేటు నివారణకు రక్తహీనత నివారణపై దృష్టి సారించాలన్నారు. ఎఎన్‌ఎం, ఆశాలు, అంగన్వాడి కార్యకర్తలు, మహిళా పోలీసు గ్రామంలో ఇంటింటికి తిరిగి రక్తహీనత కలిగిన వారిని గుర్తించాలని సూచించారు.

అంటిపేటలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని అంటిపేట గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం బుధవారం నిర్వహించారు. రోగులను తనిఖీలు చేసి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంగు తిరుపతిరావు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ సేనపతి తిరుపతిరావు, ఎంపిటిసి సేనపతి నిర్మల, మాజీ జెడ్‌పిటిసి అంబటి కృష్ణంనాయుడు, వైద్యాధికారులు పావని, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం తహశీల్దార్‌గా రామారావు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం తహశీల్దార్‌గా రామారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పార్వతీపురం కలెక్టర్ కార్యాలయంలో ఎఒగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ తహశీల్దార్‌గా నియమితులైన సత్యనారాయణ వారం రోజుల వ్యవధిలోనే బదిలీపై కురుపాం వెళ్లారు.

బిసి డిక్లరేషన్‌పై మాజీ ఎమ్మెల్యే హర్షం

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

టిడిపి-జనసేన ప్రకటించిన బిసి డిక్లరేషన్ వెనుకబడిన తరగతులకు ఆర్థికంగా ఎంతో మేలు చేకూరుస్తుందని మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. బుధవారం తన క్యాంపు కార్యాలయం ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లకే పింఛను రూ.4 వేలు అందించడం ద్వారా బిసిల జీవితంలో పెను మార్పులు తీసుకువస్తుందన్నారు. సంపద సృష్టించడం తెలిసిన తమ అధినాయకుడు చంద్రబాబు పథకాలు ప్రజల్ని ఎంతగానో ఆకర్షిస్తున్నాయని తెలిపారు. తాము అధికారంలోకి మళ్లీ వచ్చిన వెంటనే విశాఖను పరిపాలన రాజధానిగా చేసి అక్కడే ప్రమాణ స్వీకారం నిర్వహిస్తానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్న మాటలు చూస్తుంటే ఆరిపోయే ముందు దీపానికి వెలుగు ఎక్కువ అన్న సామెత గుర్తుకు వస్తుందని ఎద్దేవాచేశారు.

నేడు మార్కెట్ ఆశీల వేలం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ రోజువారి మార్కెట్, పలు ప్రాంతాల్లో రోడ్డు మార్జిన్ ఆశీలకు గురువారం వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ వాణిజ్యభవన సముదాయంలో ఉన్న 22, 34, 36, 44, 45 నంబర్ల షాపులకు అద్దె ప్రాతిపదికన వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేడు వాహనాల వేలం

పాచిపెంట : మండలంలో పలు సారా కేసుల్లో స్వాధీనం చేసుకున్న రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను గురువారం స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎస్ఐ పి.నారాయణ రావు తెలిపారు.

ఎన్నికల వేళ.. చేరికల మేళా

- అధికార పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ షురూ
- పట్టణంలో తలుపులు తెరుస్తున్న వైసిపి!

ప్రజాశక్తి-సాలూరు

నియోజకవర్గంలో అధికారపార్టీ ఆపరేషన్ ఆకర్ష్‌కి శ్రీకారం చుట్టనుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఇంతవరకు టిడిపి నుంచి నాయకుల చేరికలకు తలుపులు తీయని వైసిపి నాయకత్వం ఇప్పుడు బార్లా తెరిచేందుకు సిద్ధమైంది. పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలు జారిపోకుండా ముందు జాగ్రత్తలు చేపడుతోంది. ప్రతిపక్ష పార్టీ నుంచి వస్తామంటున్న నాయకులకు ద్వారాలు తెరిచింది. దీనిలో భాగంగా పట్టణానికి చెందిన కీలక టిడిపి నాయకుడి చేరికతో ఆపరేషన్ ఆకర్ష్‌కి శ్రీకారం చుట్టనున్నారు. కొంతకాలంగా ఆ పట్టణ నాయకుడు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంధ్యారాణితో విభేదించి పార్టీకి దూరంగా ఉన్నారు. గతంలో ఆయన భార్య మున్సిపల్ చైర్ పర్సన్‌గా పనిచేశారు. టిడిపి అభ్యర్థిగా సంధ్యారాణి పేరు అధిష్టానం ప్రకటించడంతో ఆయన అసంతృప్తితో రగిలిపోతున్నారు.



టిడిపిలో ఇమడలేక అధికారపార్టీలో చేరడానికి రంగం సిద్ధం చేసుకున్నారు.

డిప్యూటీ సిఎం రాజన్నదొర ఐదోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి సిద్ధమవుతున్నారు. ఎమ్‌పిగా పోటీ చేయాలన్న ఆయన కోరికను పార్టీ అధిష్టానం అంగీకరించే పరిస్థితి లేదు. దీంతో ఆయన అసెంబ్లీ సమరానికి రంగం చేసుకుంటున్నారు. దీని కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. సుమారు 17 సంవత్సరాలుగా నియోజకవర్గంలో తిరుగులేని నేతగా ఎదిగిన రాజన్నదొర అనుకూల, ప్రతికూల అంశాలపై దృష్టి సారించారు. డిప్యూటీ సిఎంగా, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా తన పనితీరు పట్ల ఎక్కడైనా నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి ఉన్నట్లు కనిపిస్తే వారికి తగిన భరోసా ఇచ్చి దారికి తెచ్చుకొనే ప్రక్రియలో తలమునకలై ఉన్నారు. మరో వైపు ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలను అక్కున చేర్చుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీని కోసం పట్టణ పార్టీకి చెందిన సీనియర్ నాయకుల ద్వారా ఆపరేషన్ ఆకర్ష్‌ని వేగవంతం చేయాలని భావిస్తున్నారు.

నియోజకవర్గంలో టిడిపి అభ్యర్థి సంధ్యారాణిని వ్యతిరేకిస్తున్న నాయకులు, కార్యకర్తలపై అధికారపార్టీ దృష్టిసారించింది. మరోవైపు మండలాల్లో కూడా వైసిపి కేడర్ చెక్కు చెదరకుండా ఉండేందుకు డిప్యూటీ సిఎం రాజన్నదొర ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. రానున్న కొద్ది రోజుల్లో చేరికల మేళా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది.

ఎన్నికల నిర్వహణకు ప్రజాప్రతినిధులు సహకరించాలి

ప్రజాశక్తి - కురుపాం

రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు ప్రజాప్రతినిధులు సహకరించాలని ఆర్‌ఒ వి.వి.రమణ కోరారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ బిఎస్-ఎస్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ మరో వారం రోజుల్లో వస్తున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు కోడ్ నిబంధనలు పాటించాలన్నారు. అధికారులకు సహకరించి నియోజకవర్గంలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేటట్లు చూడాలని కోరారు. శిథిలావస్థలో పోలింగ్ స్టేషన్లు ఉంటే వాటి స్థానంలో వేరే చోట పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి గుర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైసిపి నుంచి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసి స్వామియోజులు, టిడిపి సీనియర్ నాయకులు పోలూరు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి జగన్‌మోహనరావు

మలేరియా ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్‌మోహనరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. సబ్ యూనిట్ అధికారులు, మలేరియా టెక్నికల్ సూపర్ వైజర్లకు జిల్లా మలేరియా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ఆరోగ్య సర్వే చేపట్టి గ్రామాలు, వసతి గృహాలు, పట్టణాల్లో జ్వర లక్షణాలున్న వారిని గుర్తించాలన్నారు. మలేరియా, డెంగీ నిర్ధారణ పరీక్షలు సత్వరమే జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. మీ పరిధిలో ఉండే మండలాల్లో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బందితో సమన్వయం చేసుకుని, జ్వర ప్రభావిత ప్రాంతాలు, వాటి నివేదికలు, శానిటేషన్ ప్రక్రియ, డ్రైడే కార్యక్రమాలు, స్ప్రేయింగ్ తదితర అంశాలపై చర్చించి తగు కార్యాచరణ సిద్ధం చేసుకోవాలన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లో ల్యాబ్ పరీక్షల నివేదికలు, రికార్డులు తరచుగా పరిశీలించాలన్నారు. వసతిగృహాలను సందర్శించి, అక్కడ కిటికీలకు మెస్‌ల అమరిక తీరు, సిక్ రూం నిర్వహణ, కిచెన్, హాస్టల్ పరిసరాల్లో శానిటేషన్ తీరును గమనించాలన్నారు. ఎక్కడైనా జ్వరాలు నిర్ధారణ అయితే వెంటనే తెలియజేయాలని సూచించారు. సమావేశంలో ఎఎంఒ సూర్యనారాయణ, మలేరియా కన్సల్టెంట్ రామచంద్ర, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని పనుకువలస పంచాయతీ పెద్ద చీపురువలస గ్రామ సమీపంలోని పారమ్మకొండ వద్ద శివరాత్రి సందర్భంగా జరిగే జాతరకు వేలాదిగా యాత్రికులు హాజరవుతారు. ఈ నేపథ్యంలో బుధవారం బందోబస్తు ఏర్పాట్లను ఎఎస్‌పి సునీల్ సోరెన్ పరిశీలించారు. సాలూరు రూరల్ సిఐ బాలకృష్ణ, ఎస్ఐ పి.నారాయణరావుకు పలు సూచనలు చేశారు. అనంతరం పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలను ఆయన పరిశీలించారు.

పారమ్మకొండపై బందోబస్తు గురించి చర్చిస్తున్న ఎఎస్‌పి

మొక్కజొన్న మద్దతు ధర రూ.2090

ప్రజాశక్తి-పాచిపెంట

మొక్కజొన్న కొనుగోళ్లను పరిశీలిస్తున్న ఎఒ తిరుపతిరావు

ప్రభుత్వం క్వింటా మొక్కజొన్నకు మద్దతుధర రూ.2090 ప్రకటించిందని, ఇంతకంటే తక్కువకు రైతుల నుంచి కొనుగోలు చేయకూడదని ఎఒ కె.తిరుపతిరావు తెలిపారు. బుధవారం మండలంలోని పాంచాలి, మాతుమూరు, గురువునాయుడుపేట గ్రామాల్లో మొక్కజొన్న కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రం సిబ్బంది గ్రామాలలో పర్యవేక్షిస్తూ మొక్కజొన్న కొనుగోళ్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని చెప్పారు. ఎక్కడా మద్దతు ధర కంటే తక్కువ ధరకు కొనుగోలు చేయకుండా చూడాలని సూచించారు. రబీ సీజన్లో సరాసరి దిగుబడి 32 క్వింటాళ్లు మాత్రమే ఉందన్నారు. గతేడాదితో పోలిస్తే కొంచెం దిగుబడి తక్కువగా వస్తున్నట్లుగా రైతులు తెలిపారు.

అధిక దిగుబడికి సూచనలు

మండలంలో చాలామంది రైతులు ఖరీఫ్, రబీ సీజన్లలో ఏళ్ల తరబడి మొక్కజొన్న వేస్తూ ఉండడం వల్ల దిగుబడులు తగ్గుతున్నాయని ఎఒ తెలిపారు. తప్పనిసరిగా పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. నీటి సౌకర్యం ఉన్నవారు వేసవిలో అపరాలు సాగు చేయడం ద్వారా అదనపు దిగుబడిని సాధించడమే కాకుండా భూసారాన్ని కూడా పరిరక్షించుకోవచ్చని తెలిపారు. వేసవి సాగుకు అవసరమైన పెసర, మినుము విత్తనాలు రాయితీపై రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తామని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఒలు శ్రీను, గణేష్, దినేష్ పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై ఆర్‌ఒ దృష్టి

ప్రజాశక్తి-సాలూరు

అధికారులకు సూచనలు చేస్తున్న ఆర్‌ఒ విష్ణుచరణ్

నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లపై ఆర్‌ఒ, ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్ దృష్టిసారించారు. ఆర్‌ఒగా తన బాధ్యతలు నిర్వహించడానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా రైల్వే స్టేషన్ రోడ్‌లో నిర్మాణంలో ఉన్న ఆర్‌అండ్‌బి బంగ్లా పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆర్‌అండ్‌బి అతిథి గృహ నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. దీనిలో పై అంతస్తులో ఉన్న రెండు గదులను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేసి అతిథి గృహాన్ని సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో స్ట్రాంగ్ రూంని తహశీల్దార్ ఆనంద్ కుమార్‌తో కలిసి ఆయన పరిశీలించారు. తహశీల్దార్ కార్యాలయంలో పైన ఉన్న గదిని ఆర్‌ఒ గదిగా మార్చాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నామినేషన్ దాఖలు ప్రక్రియ నుంచి ఎన్నికల నిర్వహణ వరకు రిటర్నింగ్ అధికారిగా బాధ్యతలు నిర్వహించాల్సి ఉన్నందున ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

నీటి ఎద్దడి నివారణకే క్రాష్ ప్రోగ్రాం

కురుపాం.. క్రాష్‌ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపిపి శెట్టి పద్మావతి

ప్రజాశక్తి - కురుపాం

వేసవిలో గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేకుండా చేయాలన్నదే క్రాష్ ప్రోగ్రాం లక్ష్యమని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిడిఒ ఎస్.అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రాష్ ప్రోగ్రాన్ని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రాష్ ప్రోగ్రాం వాహనం మండలంలో సుమారు 40 రోజులపాటు అన్ని గ్రామాలకు వస్తుందన్నారు. బోర్లకు మరమ్మతులు చేయించి ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులదేనని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ కె.నాగేశ్వరరావు, ఎఇ ఆర్.వేణుగోపాల్, జెడ్‌పిటిసి జి.సుజాత, వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, ఎంపిటిసిలు స్వామియోజులు, సంతోషిని పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో బుధవారం ఎంపిపి రవణమ్మ శ్రీరాములునాయుడు క్రాష్ ప్రోగ్రాం వ్యానును జెండా ఊపి ప్రారంభించారు. మండలంలో 504 చేతి పంపులు ఉన్నాయని, వాటిలో మరమ్మతులకు గురైన వాటిని బాగు చేస్తారని ఎంపిపి తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బాబ్జీ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్ కుమార్, ఎఒ ఎంఎల్ఎన్ ప్రసాద్, సత్యనారాయణ, క్రిష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

సీతానగరం.. క్రాష్‌ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పార్వతీపురంరూరల్.. వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపిడిఒ

పార్వతీపురంరూరల్ : వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా నీటి పంపుల నిర్వహణ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎంపిడిఒ అకిబ్ జావేద్ తెలిపారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో ఎంపిపి మజ్జి శోభారాణితో కలిసి క్రాష్ ప్రోగ్రాం సంచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతిపంపుల నిర్వహణకు ఐదు లక్షల రూపాయల నిధులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎన్.కృష్ణుడు, ఎఒ రమణమూర్తి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తోనే ప్రాణాలకు రక్షణ

ప్రజాశక్తి- పార్వతీపురం

హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని శ్రీ సాయిరాం డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు కోరారు. ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో భాగంగా బుధవారం అడ్డాపుశీల గ్రామంలో రోడ్డుపై రహదారి భద్రతా నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులను కూడా చైతన్యం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధి పెంట అప్పారావు, ప్రిన్సిపల్ జి.శ్రీధర్, ఎన్‌ఎస్‌ఎస్ పిఒలు డి.దేవి, తిరుపతిరావు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-కొమరాడ

ఒడిశా నుంచి ఆంధ్రాకు అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్లు కొమరాడ ఎస్ఐ నీలకంఠం తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేసి, వివరాలు వెల్లడించారు. మంగళవారం కూనేరు చెకపోస్ట్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా, పార్వతీపురం వైపు వస్తున్న బస్సులో ఇద్దరు అనుమానితులను గుర్తించారు. వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా మూడు కిలోల గంజాయి బయటపడింది. గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వారిది విజయవాడ, హైదరాబాద్‌గా గుర్తించారు. వీరిద్దరూ మైనర్ కావడంతో వివరాలను గోప్యంగా ఉంచామన్నారు.

దివ్యదర్శన క్షేత్రం ప్రారంభం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్.

పట్టణంలోని నాలుగో వార్డులో సౌందర్య నారాయణమూర్తి నగర్ వద్ద బ్రహ్మకుమారీలు, శివశక్తి భవన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ద్వాదశ జ్యోతిర్లింగ దివ్యదర్శన క్షేత్రాన్ని బుధవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోరాడ శ్రీనివాసరావు (నాని), సువ్వాడ లావణ్య పాల్గొన్నారు.

సాలూరు పురపాలక సంఘం

షార్ట్ టెండర్ నోటీసు

ఆర్. సి. నెం.15/2023-ఇ1. **తేది.06.03.2024**

సాలూరు పురపాలక సంఘమునకు సంబంధించి పురపాలక సంఘ పరిధిలో 15వ ఆర్థికసంఘం నిధులు, GGMP నిధులు మరియు సాధారణ నిధులతో చేపట్టబోవు ఈ దిగువ చూపిన పనులకు e-Procurement Portal ద్వారా షార్ట్ టెండర్లను ఆహ్వానించడమైనది.

మొత్తం పనులు	:	130 పనులకు
మొత్తం అంచనా విలువ	:	రూ. 389.41 లక్షలు
టెండర్ డాక్యుమెంట్లు అందుబాటు తేదీ మరియు సమయం	:	తే. 07-03-2024 ది ఉదయం 11:00 గంటల నుండి
టెండర్లు స్వీకరించుటకు చివరి తేది మరియు సమయం	:	తే. 15-03-2024 ది మధ్యాహ్నం 03:00 గంటల వరకు
టెండర్లు తెరచు తేది మరియు సమయం	:	తే. 15-03-2024 ది మధ్యాహ్నం 04:00 గంటలకు

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : 1) కమీషనరు - 9849905794
2) డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు - 9849906989

ఇతర వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్ సైట్ నందు చూడగలరు.

కమీషనర్,
సాలూరు పురపాలక సంఘం.

ప్రకటన
ప్రిన్సిపల్ డిస్ట్రిక్ జడ్జిగారి కోర్టు,
కొత్తగూడెం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
D.O.P.No 21/2023

బిట్వీన్:
నాగభత్తుల అపర్ణ @ కేడెం అపర్ణ .....పిటిషనరు
And :
నాగభత్తుల రాజా ....రెస్పాండెంట్
To
నాగభత్తుల రాజా S/o బాబ్జి, వయస్సు 34సం॥, వృత్తి జూనియర్ అసిస్టెంట్, పాలకొండ ఆర్.డి.ఒ (R.D.O) కార్యాలయం, పార్వతీపురం మన్యం జిల్లా, ఆంధ్రప్రదేశ్

ఇందుమూలంగా తెలియచేయునది ఏమనగా మీపై మీ భార్య అయినటువంటి నాగభత్తుల అపర్ణ @ కేడెం అపర్ణ మీ నుండి విడాకులు కోరుచూ మీపై పైన ఉదహరించిన విడాకుల కేసు వేసి యున్నారు. మీకు కోర్టునుండి పంపిన నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారు. కావున కోర్టువారు మీ హాజరు నిమిత్తం వాయిదా **తేది 28-3-2024న** పైన ఉదహరించిన కోర్టులో **ఉదయం 10-30 గంటల**కు హాజరు కాగలరు. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//కోర్టువారి అనుమతితో//

కొత్తగూడెం
తేది: 6.3.2024

ఎస్.రమణ రెడ్డి
అడ్వకేట్, కొత్తగూడెం